సాక్షి
హైదరాబాద్, శనివారం, 5, అక్టోబర్, 2024


అమ్మవారికి పూజలు చేస్తున్న డాక్టర్ కోట నీలిమ


అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ చీర సుచిత్ర


ఎస్ఆర్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు సరిత, కిరణ్ దంపతులు


అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక


గజలక్ష్మిదేవి అలంకారంలో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు


గాయత్రీదేవి అలంకారంలో రాజరాజేశ్వరీదేవి


గాయత్రీదేవిగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలోని దుర్గాదేవి..


బేగంపేట ప్రకాష్‌నగర్ శ్రీభూలక్ష్మీ అమ్మవారు


గాయత్రీదేవి అలంకారంలో బేగంపేట కట్టమైసమ్మ అమ్మవారు..

ఉత్సవ శోభ

దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు • ఆలయాలకు పోటెత్తిన భక్తులు

రాంగోపాల్‌పేట్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు శుక్రవారం గజలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గాయత్రీదేవిగా రాజరాజేశ్వరీ అమ్మవారు

మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి శుక్రవారం గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

సనత్‌నగర్: సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు సుదర్శనాచార్యులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు.

- బేగంపేట్ ప్రకాష్‌నగర్‌లోని భూదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్త విశాల్ సుదం ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆలయ ఆవరణలో లలిత సహస్రనామం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, దాండియా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఏడు గుళ్ల దేవాలయంలో కొలువైన అమ్మవారు శుక్రవారం గాయత్రి దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు బోదాసు నర్సింహా గాయత్రి దేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


బాలాత్రిపుర సుందరీదేవిగా కనకదుర్గ అమ్మవారు

హనుమాన్, కనకదుర్గా దేవి ఆలయాల్లో..

అమీర్‌పేట: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అమీర్‌పేట కుమ్మరి బస్తీలోని హనుమాన్, కనకదుర్గా దేవి, వినాయక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయనకు పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

- హనుమాన్ ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా, కనకదుర్గ అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

బల్కంపేట ఆలయంలో కుంకుమార్చన

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన పూజలు జరిగాయి. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. శుక్రవారం అమ్మవారిని కరెన్సీతో మహాలక్ష్మీ దేవిగా అలంకరించినట్లు ఈఓ కృష్ణ తెలిపారు.



మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు, కుంకుమార్చక పూజల్లో మహిళా భక్తులు


మాణికేశ్వర్‌నగర్‌లో..


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తలసాని

నేడు కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని దివంగత మాజీ ప్రొఫెసర్ నవనీత రావు సెంట్రల్ ఫెసిలిటీ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (రౌండ్ బిల్డింగ్)లో రూ.90 లక్షలతో నిర్మించిన రమాబాయి భీమ్‌రావ్ అంబేడ్కర్ డిజిటల్ కాన్ఫరెన్స్ హాల్ శనివారం ప్రారంభంకానుంది. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి ఇంచార్జి వీసీ దాన కిశోర్ (ఐఏఎస్) ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ తెలిపారు.

9న చండీహోమం.. సీపీకి ఆహ్వానం


సీపీ సీవీ ఆనంద్‌కు ఆహ్వానం అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కాలనీలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 9న చండీ హోమం నిర్వహించనున్నారు. మూలానక్షత్రం సందర్భంగా ఘనంగా నిర్వహించే ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలకు హాజరు కావాలని కోరుతూ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు దేవాలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించండి


జిల్లా కలెక్టర్‌కు లేఖను అందజేస్తున్న కార్పొరేటర్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం గృహాలు అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు సికింద్రాబాద్ ఎమ్మెల్యే రాసిన లేఖను అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సుభాస్‌చంద్రబోస్‌నగర్‌తోపాటు దోబీఘాట్, సాయినగర్ ప్రాంతాల్లోని డబుల్‌బెడ్ గృహాలను ఆయా ప్రాంతాల్లోని లబికధదారులకు కేటాయించాలని ఆమె కోరారు. అంబానగర్‌లో జీఓ 58 ద్వారా క్రమబదీకరించిన పట్టాలను లబ్ధిదారులకు అందించాలన్నారు.

ఉత్సాహంగా సీఎం స్పోర్ట్స్ కప్ పోటీలు



ఎన్‌సీసీ క్యాడేట్లకు ట్రోఫీ అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రసూల్‌పురా: ఎల్‌బీ స్టేడియంలో సీఎం కప్ స్పోర్ట్స్ కప్‌పోటీలు ఉత్సాహంగా జరిగాయి. దాదాపు 5వేల మంది వేడుకలకు హాజరయ్యారు. ఎన్‌సీసీకి చెందిన విశిష్ట సైనికాధికారులు ఎయిర్ సీఎండీఈ, కల్నల్ సమీర్‌శర్మ, డైరక్టర్, కల్నల్ సచిన్ నింబాల్కర్ తో పాటు ఎన్‌సీసీ కి చెందిన 150 మంది క్యాడెట్లు ఈ కార్యక్రమానికి హజరయ్యారు. ఎన్‌సీసీ క్యాడేట్ బ్యాండ్ బృందం సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు. 17 మంది ఎన్‌సీసీ క్యాడేట్‌ల బృందం ఏక్ సూరిలి ఆశా హే అనే గీతాన్ని శ్రావ్యంగా ఆలపించారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక 46వ బ్రహ్మోత్సవ వేడుకలు రెండవ రోజైన శుక్రవారం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలతో అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ధ్వజారోహణం, దేవతాహ్వానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సంతానంలేని సుమారు 20 మంది దంపతులకు గరుడ ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈఓ రాజేష్ కుమార్, చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వేణుగోపాల రావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డు, రాణిగంజ్ తదితర ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్ అధ్వర్యంలో రాణిగంజ్ చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రాంగ్‌సైడ్ వాహనాల రాకపోకల కారణంగా ప్రమాదాలతో పాటు ఎదురుగా వచ్చే వాహనచోదకులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ పోలీసులు ప్లకార్డులను చేతబూని వాహనచోదకులకు అవగాహన కల్పించారు రాణిగంజ్ చౌరస్తా ప్రాంతంలో రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్న సుమారు 70 మందికి పోలీసులు పెనాల్టీలు వేశారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమకారుల కోసం మరో సంఘాన్ని ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటుచేసిన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం (టీయూడబ్ల్యూఏ) సమావేశం శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించనున్నట్లు అధ్యక్షులు డాక్టర్ విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధకుల సంక్షేమం కోసం స్థాపించిన కొత్త సంఘం మొదటి సమావేవానికి ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

చిన్నారులకు బ్యాగుల పంపిణీ



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు బ్యాగులను పంపిణీ చేశారు. మహాలక్ష్మీ క్లబ్ హైద్రాబాద్ చాప్టర్ మహిళలు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మహాలక్ష్మీ క్లబ్ ప్రతినిధులు భానురాంనాథ్, డాక్టర్ గిరిజా, నవీన్ పురోహిత్, శ్యామలాదేవీ, సి. గిరిజా, సంధ్యారాణి, జ్యోతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఆల్విన్, ఎర్రమంజిల్, బేగంపేట్, మైత్రీవనం, గ్రీన్‌ల్యాండ్స్, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు శ్రీనివాసకాలనీ ఈస్ట్, 2ఆర్‌టీ క్వార్టర్స్, ఎస్ఆర్ నగర్ బస్టాప్ వెనుక ప్రాంతం, గాయత్రీనగర్, కాసాని జ్ఞానేశ్వర్ హౌస్ ఏరియా, జెక్‌కాలనీ, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, సెయింట్ థెరిస్సా హాస్పటల్ ఏరియా ప్రాంతాల్లో..
- ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు ఎస్ఆర్‌నగర్ మెయిన్‌రోడ్డు ఏరియా, కమ్యూనిటీ హాల్ లేన్, యూనియన్ బ్యాంక్ లేన్, ఎస్‌బీహెచ్ బ్యాంక్ లేన్, చైతన్య జూనియర్ కాలేజ్, 2ఆర్‌టీ, 3ఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతాల్లో..
- 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శాంతిబాగ్, శివబాగ కేకే జోన్ హోటల్ ప్రాంతాల్లో..
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సత్యం థియేటర్ మెయిన్‌రోడ్డు, బ్లూఫాక్స్ , ప్రైమ్ హాస్పటల్ ఏరియా, సనత్‌నగర్ ఫైర్ స్టేషన్, పోలీసు క్వార్టర్స్, 3ఆర్‌టీ, ఫతేబాగ్, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు ఏరియా, అల్లావుద్దీన్‌కోఠి, ఓల్టాస్, టయోటా షోరూంలేన్ ఏరియా ప్రాంతాల్లో..
- మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకకు బాపునగర్, ఎస్ఆర్‌నగర్ మెయిన్‌రోడ్డు, లోయర్ వాటర్ వర్క్స్, 2ఆర్‌టీ, మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు జీఎంఆర్, ఫ్లైఓవర్ బేకరీ, స్టేటస్ ప్లాజా ఏరియా,
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు వైట్‌హౌస్, మీనాబజార్, బ్రాహ్మణవాడీ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

అలయ్ బలయ్‌కు రండి..



లాలాపేట: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 13న నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించతలపెట్టిన అలయ్ బలయ్ కార్యక్రమానికి రావాలని కోరుతూ టిజాక్ చైర్మెన్ ప్రొ ఇటికాల పురుషోత్తమ్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు నిర్వాహకులు హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి శుక్రవారం తార్నాకలో ప్రొ టికాల పురుషోత్తమ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో టిజాక్ హైదారబాద్ జిల్లా చైర్మెన్ శ్రీరామ్ శివకుమార్ తదితరులున్నారు. జేఏసీ కోఆర్డినేటర్ ఆర్ వి శ్రీనివాస రావు తదితరులున్నారు.

అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం వద్దు

అమీర్‌పేట: అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం వద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. శుక్రవారం సనత్‌నగర్ కేఎల్ఎన్‌వై పార్కులో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. సమస్యలపై ఆరా తీశారు. ముందుగా వ్యర్థాలను తరలించే వాహనాలను ప్రారంభించారు. పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు, చిల్డ్రన్స్ పార్కులో పరికరాలకు మరమ్మత్తులు చేపట్టాలని,అదే విధంగా కొన్ని చోట్ల లైట్లు వెలగటం లేదని తెలిపారు.జిమ్ పరికరాలకు సైతం మరమ్మత్తులు చేయాలని, మొరం మట్టితో వాకింగ్ పాత్‌వేను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేశామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డీఎంసీ రజనీకాంత్ పాల్గొన్నారు.

అధికారులతో డిప్యూటీ మేయర్ సమీక్ష



లాలాపేట: దసరా నవరాత్రులను పురస్కరించుకుని నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలనీ అధికాలను ఆదేశించారు. సమావేశంలో డీసీ సుభాష్,శానిటేషన్ డీఈ వెంకటేష్, డీఈఈ సువర్ణ, ఏఈ వేణు తదితరులు పాల్గొన్నారు.

విజయ పాల సరఫరాలో అంతరాయం

నిలిచిపోయిన లక్ష లీటర్ల పాలు

లాలాపేట: డెయిరీ అధికారుల నిర్లక్ష్యం, ట్రాన్స్‌పోర్టు విభాగంలో తలెత్తిన సమస్యతో విజయ డెయిరీ పాల సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో గురువారం అర్ధరాత్రి నుంచి దాదాపు 25 పాల సరఫరా వాహనాలు నిలిచిపోయాయి. దీని వలన దాదాపు 1 లక్షల లీటర్ల వరకు పాలు విజయ ప్లాంట్‌కే పరిమితమయ్యాయి. విషయం తెలుసుకున్న ప్రభుత్వ ఉన్నతాధికారులు, లాలాపేటలోని విజయ భవన్‌లో చైర్మెన్, ఎండీ, ఇతర ఉన్నతాధికారులతో, ట్రాన్స్‌పోర్టు యజమానులతో సమావేశమై చర్చించారు.అనంతరం పాల సరఫరాను పునరుద్ధరించారు.

నిలిచిపోయిన పాల ప్యాకెట్ల ప్యాకింగ్

- గత వారం రోజుల నుంచి లాలాపేటలోని విజయ డెయిరీ ప్లాంట్‌లో పాల ప్యాకెట్ల ప్యాకింగ్ నిలిచిపోయింది. శంషాబాద్ రావిర్యాలలోని మెగా డెయిరీ ప్లాంట్ నుంచి తయారైన పాలు, పాల ప్యాకెట్లను కంటెయినర్‌లలో లాలాపేట ప్లాంట్‌కు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ అక్కడి నుంచి పాలు సకాలంలో ఇక్కడి తీసుకురావడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనిపై ట్రాన్స్‌పోర్టు విభాగం సిబ్బందికి, విజయ డెయిరీ ట్రాన్స్‌పోర్టు విభాగం అధికారుల మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు కంటెయినర్ వచ్చింది. ఇంత ఆలస్యంగా వచ్చిన ఈ పాలను సరఫరా చేయలేమని ట్రాన్స్‌పోర్టు సిబ్బంది విధులు బహిష్కరించారు. దీంతో దాదాపు 25 వాహనాలు నిలిచిపోయాయి. లాలాపేట నుంచి డెయిరీ ప్లాంట్ రావిర్యాలకు తరలివెళుతుందని దీంతో తాము ఉపాధి కోల్పోనున్నామని ట్రాన్స్‌పోర్టు కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

గాంధీఆస్పత్రి వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు


గాంధీఆస్పత్రి ఎదుట మెట్రో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఎదుట తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టామని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారి మధ్యలో గల మెట్రో ఫుట్‌పాత్‌ను కొంతమంది ఆక్రమించుకుని అక్కడే నివాసం ఉంటున్నారని, రాత్రి సమయాల్లో నిద్రమత్తులో ఫుట్‌పాత్‌పై నుంచి కిందపడడంతో వాహనాలు ఢీకొని తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల ఇరువురు మృత్యువాత పడ్డారని వివరించారు. ప్రమాదాలను నివారించేందుకు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి మెట్రో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించామని, అక్కడ నివసిస్తున్నవారికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

- వాటిని విక్రయిస్తున్న వ్యక్తి కూడా పోలీసుల అదుపులో..
- 8 వాహనాలు స్వాధీనం


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న అదనపు డీసీపీ నర్సయ్య

సికింద్రాబాద్: ద్విచక్ర వాహనాలను మాయం చేస్తున్న మాజీ హోం గార్డును, వాటిని ఇతరులకు విక్రయిస్తున్న మరో వ్యక్తిని చిలకలగూడ పోలీసులు అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.5 లక్షల విలువ చేసే 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ నర్సయ్య నేరస్తుల వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ ప్రాంగణంలో జరుగుతున్న ద్విచక్రవాహనాల వరుస దొంగతనాలకు అందుతున్న ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. రహస్య సమాచారం, సీసీ ఫుటేజీల ఆధారంగా సికింద్రాబాద్ బోయిగూడకు చెందిన అబ్రహం జానీ అలియాస్ జాన్ (48) దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది. అబ్రహం జానీని అదుపులోకి తీసుకుని విచారించగా అతను హోం గార్డుగా పనిచేసినట్లు తేలింది. సులభంగా డబ్బులు సంపాదించడానికి బైక్ లను చోరీ చేయడమే వృత్తిగా ఎంచుకున్నాడు. తాను దొంగిలించిన వాహనాలను పార్శిగుట్ట శ్రీనివాస్‌నగర్‌కు చెందిన రావుల ఆంజనేయులు (44) అనే మరో వ్యక్తికి అందించేవాడు. సదరు వాహనాలను ఇతరులకు ఆంజనేయులు విక్రయించడం ద్వారా అబ్రహం జానీకి డబ్బు ఇచ్చేవాడు. ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు 8 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు అదనపు డీసీపీ నర్సయ్య తెలిపారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..


జెక్‌కాలనీ వాసవీ సెంట్రల్ కోర్టు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు..

సనత్‌నగర్: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...బంగారు బతుకమ్మ ఉయ్యాలో...చిత్తూ చిత్తుల బొమ్మ శివుడీ ముద్దుల గుమ్మ...అంటూ బతుకమ్మ పాటలతో జెక్‌కాలనీ సందడిగా మారింది. కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రోజుకొక ప్రాంతంలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం జెక్‌కాలనీ వాసవీ సెంట్రల్ కోర్టు వద్ద బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. రంగురంగుల పూలతో అందంగా అలంకరించి తెచ్చిన బతుకమ్మలను ఒక్కచోట పేర్చి ఆడిపాడారు. కాలనీ ఫెడరేషన్ సహకారంతో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణలతో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులు భాగ్యలత, లంక హైమావతి, అమరావతి, హరిత, కృష్ణకుమారి, సృజన, శ్రీదేవి, జ్యోతి, రాజ్యలక్ష్మీ, సంధ్య, మాధవి వాణి, స్వప్న, వాణి, మాధవి, విజయ, భ్రమరాంబ, సునీత, పద్మజ పాల్గొన్నారు.

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఎస్ అండ్ టీ సికింద్రాబాద్ బ్రాంచి ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ ముఖ్యఅతిథులుగా అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ నాగలక్ష్మి, ట్రెజరర్ నరసింహారెడ్డి, సెక్రేటరీ వినాయకరావు హాజరయ్యారు.

చిన్నారుల బతుకమ్మ వేడుకలు..



లాలాపేట: లాలాపేట సాయినగర్ అంగన్‌వాడి కేంద్రంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సంప్రదాయ వస్త్రాల్లో హాజరై రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపారు. అంగన్‌వాడి టీచర్లు రోజా రాణి, కృపావతి, సుజాత, సంధ్యారాణి, గోదావరి, సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.


మజ్దూర్ యూనియన్ ఎస్ అండ్ టీ బ్రాంచి కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379